క్లుప్తంగా

నేడు చేవెళ్లలో జేపీ నడ్డా బహిరంగ సభ

చేవెళ్ల: ఎన్నికలు సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేవెళ్లలో ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరవుతారని మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగారెడ్డి, అత్తెల్లి అనంత్‌రెడ్డిలు తెలిపారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఈ సభ మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుందని చెప్పారు. ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకులు హాజరవుతారని చెప్పారు.

వచ్చే సమావేశంలో చర్చలు

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా వచ్చే మండల సమావేశంలో సమస్యలపై చర్చలు జరపనున్నట్లు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా వ్యవసాయం, ఐసీడీఎస్ శాఖ అధికారులు మాత్రమే తమ శాఖల ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. అనంతరం సమావేశాన్ని త్వరగా ముగించడానికి గల కారణాలను ఎంపీపీ సభకు హాజరైన సర్పంచులు, ఎంపీటీసీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్ర బాబు, ఏఓ గోపాల్, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి అలవర్చుకోవాలి

సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు

మొయినాబాద్: ప్రతిఒక్కరూ దేశ భక్తి అలవర్చుకోవాలని, ఝాన్సీలక్ష్మీబాయి లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు పేర్కొన్నారు. మొయినాబాద్ మండలకేంద్రంలోని సిద్ధార్థ కళాశాలలో ఏబీవీపీ శనివారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయులు జీవితాలను త్యాగం చేసి స్వాతంత్ర్యపోరాటంలో అమరులయ్యారని గుర్తు చేశారు. ఝాన్సీ లక్ష్మీబాయి చేసిన పోరాటం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ కళాశాల అధ్యక్షుడు కావలి శ్రీకాంత్, అంజయ్, సాయి, వంశీ, వికాస్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు



షాద్‌నగర్ తరలిన మైనార్టీ నాయకులు

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మైనార్టీ ఆత్మీయ సమ్మేళనానికి కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి మైనార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కొందుర్గులో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ జెండా ఊపి వాహనాలను తరలించారు. సమావేశానికి వెళ్లినవారిలో షుకూర్, నసీర్, యేహపాష, ఖాజపాష, నసీర్, మసూద్, జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షులు సయ్యద్ హఫీజ్, జబ్బార్, ఖలీల్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, జగ్గు, జగీశ్వర్, చందు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ సూచించారు. శనివారం ఇంజాపూర్‌లోని తుల్జా భవానీ కాలనీలో ఓటు అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది బాల్‌రాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి విరాళం

దిల్‌సుఖ్‌నగర్: నగరంలోని డీడీ కాలనీకి చెందిన సత్యనారాయణ శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహానికి డిసెంబర్ నెల రేషన్ కోసం రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం, పప్పులు, నూనె కొనుగోలు కోసమని ఇచ్చామన్నారు.



షాబాద్: కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కాలె యాదయ్య



చేవెళ్ల: ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు

మళ్లీ మా ప్రభుత్వమే

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి
- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- బొబ్బిలిగామ, కొమరబండ, కేశవగూడ, అజీజ్‌నగర్, గుండాల లక్ష్మిగూడలో ప్రచారం

చేవెళ్ల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్, చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్యలది హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. గుండాల, సాయిరెడ్డిగూడ, లక్ష్మిగూడ గ్రామాల్లో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలను వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయాలేని విధంగా పేదలకోసం తమ ప్రభుత్వం పని చేసిందన్నారు. ప్రభాకర్, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, తోట చంద్రశేఖర్, శ్రీరాంరెడ్డి, జంగారెడ్డి, కాంతారెడ్డి, గణేశ్, కరుణకర్, దండు సత్తి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేశారని, ఈ పథకాలే మళ్లీ తనను గెలిపిస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బొబ్బిలిగామ, కొమరబండ, కేశవగూడ, ముద్దెంగూడ, చర్లగూడ, ఎల్గొండగూడ, మల్లారెడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలె యాదయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెల్లుతుందన్నారు. ఈ ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలో కొస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, పొన్న నర్సింహారెడ్డి, వెంకటయ్య, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను చూసి ఓటు వేయాలని జిల్లా నాయకులు కొత్త మాణిక్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీహరియాదవ్ పేర్కొన్నారు. అజీజ్‌నగర్ గ్రామంలో శ్రీహరి యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని వారు జోస్యం చెప్పారు. అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్యశ్రీశైలం, గ్రామ అధ్యక్షుడు మాడి మల్లారెడ్డి, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రావూఫ్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారివెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, పేర్కొన్నారు. పత్తేపురం, బంగ్లాబడ్డలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఏఎంసీ చైర్మన్ పాపారావు, గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మన్నగారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కామర్స్ లెక్చరర్‌కు డాక్టరేట్



అర్పిత, (కామర్స్ లెక్చరర్, వికారాబాద్)

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ సోషల్ వెల్ఫేర్ వికారాబాద్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న పాకలపాటి అర్పిత పీహెచ్‌డీ పట్టా పొందారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మా మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు చెందిన పాకలపాటి అర్పిత 2019 నుంచి తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. 'ఇంపాక్ట్ ఆఫ్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఆన్ జాబ్ శాటిస్‌ఫ్యాక్షన్ అండ్ జాబ్ ఫర్‌పార్మెన్స్ ఆన్ ఎవిడెన్స్ ఫ్రమ్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజెస్' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పట్టా పొందారని సూచించారు. అనంతరం అర్పితకు కళాశాలలో అధ్యాపకులు అభినందించారు. అనంతరం అర్పిత మాట్లాడుతూ పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పించిన యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, గైడ్ ఆచార్యులకు పరిశోధన గ్రంథం సమర్పించడంలో ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భర్త వినయ్‌కుమార్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



కరాటేలో సత్తా చాటిన వంశీధర్ స్కూల్ విద్యార్థులు

బడంగ్‌పేట్: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ శ్రీవంశీధర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 3 బంగారు, 2 రజిత, 18 కాంస్య పతకాలు సాధించడంతో పాటు చాంపియన్‌షిప్ కప్‌ను సైతం కైవసం చేసుకున్నారు. కాంటినెంటల్‌సాత్‌ఖాన్ కరాటేడో ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు, 50 పాఠశాలల నుంచి హాజరై పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా 67వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో బడంగ్‌పేటలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. చదరంగంలో భాగ్యశ్రీ బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయింది. స్కేటింగ్ విభాగంలో పి.వర్షిత ఐదు వందలు, వేయి మీటర్ల విభాగంలో కాంస్యం సాధించింది. పి.వరుణ్ స్కేటింగ్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుప్రభ హనీ, శిక్షకులు నోమన్‌అలీ, హఫీస్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం విఫలం

మీర్‌పేట: హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేసీఆర్ పెద్ద మోసకారి అని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి మీర్‌పేట, జిల్లెలగూడ పరిధిలోని కాలనీలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ పారిజాతరెడ్డి, నాయకులు శ్రీశైలం, భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ: మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్ గెలుపు ఖాయమని డీసీసీ కార్యదర్శి బరిగెల రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని 12వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జానకీరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రచార హోరు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో కాంగ్రెస్ ప్రచారం ఊపందుకుంది. ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని నాయకులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆడబిడ్డల వివాహానికి లక్షతో పాటు తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

అపూర్వ సమ్మేళనం

మొయినాబాద్‌రూరల్: ఏపీలోని మచిలిపట్నంలో శ్రీ వేంకటేశ్వర హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో 1989–93 బ్యాచ్ 120 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించారు. ఆ విద్యార్థులు శనివారం మండల పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో అపూర్వ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాలలో తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 30 సంవత్సరాల క్రితం ఉన్నత విద్యనభ్యసించిన వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా, పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా తాము స్థిరపడ్డట్లు పేర్కొన్నారు. కుటుంబ పోషణలో ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. అనంతరం ఒకరినొకరు కుటుంబ, పరిచయాలు చేసుకున్నారు. ఈ సమ్మేళనానికి కోఆర్డినేటర్లుగా ప్రసాద్ శివపురం, కృష్ణరావులు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ శ్రీనివాస్, మల్లికార్జున్, అరుణ్‌కుమార్, పి రమేశ్, గిరిశ్, ప్రభు, చారి, ఉదయ్‌భాను, జెపి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో హిందూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

- డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

షాద్‌నగర్‌రూరల్: గైరాన్ పొలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగారెడ్డిగూడ గ్రామ శివారులోని సర్వేనంబర్ 287లో గైరాన్ పొలం ఉంది. ఈ పొలంలో కొందరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని వారు ఆరోపించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి దారి లేకుండా గైరాన్ పొలాన్ని కబ్జాచేసి ప్రహరీ నిర్మిస్తున్నారన్నారు. దీంతో వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గైరాన్‌పొలంపై విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎంసీ రాజు, వెంకటయ్య, ప్రవీణ్, రామకృష్ణ, చెన్నయ్య, చంద్రశేఖర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి

- గోవా ఎమ్మెల్యే జయప్రకాశ్



స్వాగతం పలుకుతున్న మహిళలు

తుక్కుగూడ: డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గోవా రాష్ట్ర ఎమ్మెల్యే కేదార్ జయ ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ పాలన అవినీతితో కూరుకుపోయిందన్నారు. ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు దోపిడి చేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. శ్రీరాములుయాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, వెంకటచారి, శ్రీనివాస్, చంద్రారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పన్నులు తగ్గిస్తాం

మీర్‌పేట: బీజేపీ అధికారంలో రాగానే మీర్‌పేటలో ఇంటి పన్నులు తగ్గిస్తామని మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ప్రకటించారు. శనివారం గాయత్రినగర్, బృందావన్‌కాలనీ, చింతలకుంట, లెనిన్‌నగర్, త్రివేణినగర్, ఎస్‌ఎల్ఎన్ఎస్ కాలనీ, జనప్రియా మహానగర్, శివాజీనగర్, చంద్రానగర్, బాలాపూర్ చౌరస్తాలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పేదలకే డబుల్ ఇళ్లు కేటాయించాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదన్నారు. డబుల్ ఇళ్ల పథకంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానికులను మోసం చేసిందన్నారు. మీర్‌పేట ప్రాంతంలో అధిక ఇంటి పన్నులు, నల్లా బిల్లులతో ప్రజలపై భారం పడుతోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను నమ్మొద్దు

- జెడ్పీటీసీ తాండ్ర విశాల

కేశంపేట: బీఆర్‌ఎస్ నాయకులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మొద్దని జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓహోటల్‌లో విందుకు వెళ్లగా అక్కడికి రాష్ట్ర మంత్రి కేటీఆర్ కూడా వచ్చాడని ఆమె తెలిపారు. హోటల్లో యాదృచ్ఛికంగానే కేటీఆర్‌ను కలిశారన్నారు. తనను పార్టీలోకి మళ్లీ రావాలని కోరినట్టు, రాలేనని మంత్రికి చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. మంత్రిని కలిసిన ఫొటోను నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు వైరల్ చేయడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు నమ్మొద్దన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న విశాల

ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూగజీవాలతో పాటు చిన్నారులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎక్కడ చూసినా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తున్నాయి. విద్యుత్ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ మేరకు శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన టీఎన్జీఓస్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీఓస్ కాలనీలో నివసించే రోషన్‌కుమార్, ప్రియాంకదేవీ దంపతులకు క్రిష్ణకుమార్ (4) సంతానం. రెండు నెలల క్రితం బిహార్ నుంచి బతుకుదెరువు కోసం కాటేదాన్ ప్రాంతానికి వలస వచ్చారు. తండ్రి ఓ ఫుడ్స్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. బాలుడు తోటి మిత్రులతో బయటికెళ్లి ఆడుకునే క్రమంలో ముగ్గురు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కడానికి యత్నించారు. క్రిష్ణకుమార్ అనే బాలుడు పైకి ఎక్కి వైర్లను తాకాడు. దీంతో బాలుడికి షాక్ తగలడంతో భారీ శబ్దంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు ఎగిరిపోయింది. ఆ శబ్దానికి ఇద్దరు చిన్నారులు పరిగెత్తారు. బాలుడు గాయాలతో కింద పడగానే స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

- కసిరెడ్డిని గెలిపించుకుందాం
- ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. మాడ్గుల మండలం దిల్వార్‌ఖాన్‌పల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా రాఘవేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరించారు. అధికారంలో వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ ప్రజలకు న్యాయం జరగడం లేదని భావించి.. ఆరు గ్యారంటీలను ప్రకటించారని తెలిపారు. నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాఘవేందర్‌రెడ్డి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దళపతిగౌడ్, యాదయ్య, గోవర్ధన్, కిరణ్, శివగౌడ్, మంగయ్య, సయ్యద్ మీర్ భూపేశ్‌కుమార్, వేణురెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ప్రచారంలో మందా జగన్నాథం

ఆమనగల్లు పట్టణంలో నారాయణరెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో మాజీ ఎంపీ మందా జగన్నాథం పాల్గొన్నారు. కల్వకుర్తిలో కసిరెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, మానయ్య, కృష్ణనాయక్, ఖాదర్, అప్పం శ్రీను, అలీం, శ్రీకాంత్, నాజర్, ఫరీద్, రహీం, కరీం, బాబా, మహేశ్ పాల్గొన్నారు. కసిరెడ్డి సతీమణి ప్రచారం ఆమనగల్లు మండలం మేడిగడ్డతాండలో శనివారం కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి మాధవి విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో గడప గడపకూ తిరుగుతూ కసిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రవీందర్ నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు మల్లేశ్, రాంజ్యానాయక్, పత్యానాయక్, సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.